సౌందర్య

రాధారాణి చాలా అందగత్తె అని ఈ నాడెవరూ ప్రత్యేకంగా చెప్ప వలసిన పనిలేదు. అందానికి రాధ పర్యాయ పదంగా మారి చాలా కాలమైంది, ఎవరైనా అందగత్తెలను పోల్చాలంటే 'అబ్బ ఆమె అచ్చం రాధారాణిలావుంది' అనే ఉపమానస్థాయికి వెళ్ళింది రాధారాణి సౌందర్యం సమాజంలో!!

అందుకనే వెంకటసుబ్బయ్యకు కృష్ణా' రావును చూస్తే మంట! అసూయ! ఏదో తెలియని బాధ! భార్య అందంగా వుండట మన్నదీ ఒకానొక పూర్వజన్మ సుకృతమేనని వెంకటసుబ్బయ్య విశ్వాసం. కృష్ణారావు ఏ పార్టీకి వచ్చినా రాధారాణిని వెంట తీసుకొని వస్తాడు-ఏ సభలకూ సమావేశాలకూ వెళ్ళినా రాధ వెంట వుంటుంది అసలా సభలకు రాధే ఓ అందం! షిఫాన్ సిల్కుచీర కుచ్చెళ్ళు అలా జార్చుకోని వెలుగునున్న ట్యూబ్ లైటులా రాధారాణి అలా నడుస్తూంటే సభ మొత్తం చిత్తైపోతుంది. ఏ క్లియోపాత్రానో, మాచర్లే వినో చూచినట్లు చూచి చూచి తన్మయం చెందిపోతుంది.

వెంకట సుబ్బయ్యకు ఆ అదృష్టంలేదు. కామాక్షి ఎన్నిక విషయంలో తాను తొందరపడ్డాడని రాధారాణిని చూచినప్పుడల్లా అనుకుంటుంటాడు సుబ్బయ్య. చూడనప్పుడూ అనుకొంటూంటాడు రాధారాణిని గుర్తుకుతెచ్చుకోని. 'యుద్ధరంగంలో ఒక్క పొరపాటు చేస్తే అపజయం తప్పదు. భార్య ఎన్నిక విషయంలో ఒక్కసారి పొరపాటు చేస్తే దాని ప్రతిఫలాలను అనుభవించక తప్పదు' అని మెడిల్‌టన్ మహాశయుడు చెప్పిన ఓ సూక్తిని తన డైరీలో ముందుపుటలో వ్రాసి పెట్టుకున్నాడు వెంకటసుబ్బయ్య. ప్రతిరోజూ డైరీ తెరచి గీతాశ్లోకంలా సూక్తిని ఓసారి పారాయణచేసి తన దురదృష్టాన్ని తానే నిందించు కొని రాధారాణిని ఒక్కసారి స్మరించు కొంటాడు వెంకటసుబ్బయ్య.

వెంకటసుబ్బయ్య కామాక్షిని పూర్తిగా ఇష్టపడే చేసుకున్నాడని చెప్ప లేము. పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించిన మామ కన్నుమూస్తూ కూతురును చేసుకోమని చేతిలో చెయ్యి వేయించుకుంటే మామమీది కృతజ్ఞతతో కామాక్షిని

చేసుకున్నాడు సుబ్బయ్య. తనీనాడు ఇంట్లో విస్తరి వెయ్యగలుతున్నాడూ అంటే అందుకు మామగారి చేయూత కారణం. నిజానికి కామాక్షి అందవికారి ఏమీ కాదు కాని కామాక్షిమీద ఇష్టమే తన వివాహానికి కారణం కాదుగా. మామపై కృతజ్ఞతతో మామకూతురితో జీవించాలి తాను కాని కృష్ణారావు అట్లా కాదే! అదీ వెంకట సుబ్బయ్య బాధ!!

'సుబ్బయ్యా రేపు సకుటుంబంగా మా ఇంటికోసారి రారాదూ' అని కృష్ణారావు తన్ను చాలాసార్లు పిలిచాడు. కాని కామాక్షివస్తావంటే కదా తీసుకెళ్ళడానికి పల్లెటూరి పాతచింతకాయ ముఖం.దీనికి నవ నాగరికత బొత్తిగా తెలీదు అని చాలా సార్లు అనుకున్నాడు వెంకటసుబ్బయ్య.

'ఏమైతే అద్దైంది' అని సాహసించి ఒక్కసారి కృష్ణారావు ఇంటికి వెళ్ళాడు సుబ్బయ్య కామాక్షిని తీసుకోని ఈ వెళ్ళడంలో ముఖ్యంగా రెండు ప్రయోజనాలున్నాయి. తన కెందుకో కృష్ణారావు ఇంటినీ రాధారాణినీ, చూడాలనిపించింది మొదటిది ఇంక రెండవది కామాక్షికి ఇలా ఒకటి రెండుసార్లన్నా ఈ సౌందర్య వంటి వాళ్ళను చూపిస్తే కొంత సంస్కారం నేర్చుకుంటుందేమోనని ఓ ఆశ !!

వెళ్ళగానే రాధారాణి అతిధుల నిద్దరినీ ఎంతో ఆదరంగా ఆహ్వానించింది.

కుషన్ కుర్చీలల్లో కూర్చోబెట్టి ఇన్ స్టాంట్ కాఫీ కలిపించి ఇప్పించి, చిలక పిట్టలా కూర్చోని కబుర్లు చెప్పడం మొదలు పెట్టింది.

కామాక్షి సిగ్గుగా తలవంచుకొని కూర్చున్నది.

రాధారాణి, కౌలాలంపూర్‌లో రామనాధన్ కృష్ణన్ ప్రదర్శించిన ప్రతిభ గూర్చి, బొంబాయి టెస్ట్‌మాచ్‌లో పటౌడి నవాబ్ నైపుణ్యం గూర్చి సోదాహరణంగా చెపుతున్నది.

నిజానికి కామాక్షికి టెన్నిస్, క్రికెట్ రెండూ కొత్తే!!

రాధారాణి ఇంటిని కూడా తన లాగే అలంకరించింది. ఎక్కడ చూచినా పూలకుండీలు-ఏలకు తొక్కలతో చేసిన కుందేళ్ళ బొమ్మలూ, గుండీలతో అల్లిన హంసల పటాలూ, రాధా మాధవుల శృంగార చిత్రాలూ, ఖజూరహో శిల్పం మోడల్సూ!!

'ఇప్పుడే వస్తాను' పాన్‌దాన్ పెట్టె కోసం లోపలికి వెళ్ళింది రాధారాణి. సిగరెట్లు తెచ్చి ఇద్దామని గదిలోకి వెళ్ళాడు కృష్ణారావు.

'మొద్దు మొగమా! ఆమె అలా మాట్లాడుతుంటే ముంగిలా కూర్చుంటా వేం! కనీసం ఒక్క మాటన్నా మాట్లాడు.' మెల్లగా అదిలించాడు వెంకటసుబ్బయ్య కామాక్షిని.

'సరే' నన్నట్లు భర్త వైపు చూచింది భయంగా కామాక్షి.

రాధారాణి వచ్చింది ఆకులూ సెంటెడ్ చున్నం. తీసుకోని.

'ఈ ఇంటికి మీరెంత అద్దె ఇస్తున్నారు' కామాక్షి అడిగింది,

'రెండు వందలయాభై' కొంచెం గర్వంగా జవాబు చెప్పింది రాధారాణి.

'కానీ పెద్ద సౌకర్యంగా వున్నట్లు తోచదు కిటికీలు చూటండీ ఒక దాని కెదురుగా ఒకటి బాగా గాలి వచ్చేటట్లు కట్టలేదు ఎందుకనో.'

రాధారాణి అదోలా ముఖం పెట్టింది.

'మీకు పాలు ఎవరు తెచ్చి ఇస్తారు' కామాక్షి ప్రశ్నించింది.

'నౌకరు'

'ఒన్న బొత్తిగా ఇబ్బంది అయిపోయిందండీ మాకు-సీసాలు రావడమే తక్కువ వచ్చాయట-మావారు క్యూలో గంటసేపు నిలబడ్డా లేవు పొమ్మని పంపించేశారు'

రాధారాణి చిరునవ్వు నవ్వింది.

వెంకటసుబ్బయ్య కెందుకో తల కొట్టేసినట్లు అనిపించింది.

'మీరు పనిమనిషి కెంత ఇస్తారు?'

'అన్నంపెట్టి ఇరవై రూపాయలు'

'మా పనిమనిషి మంచిది సుమండీ! పొద్దునా సాయంత్రం పనిచేసి పోతోంది. అంట్లు పరిశుభ్రంగా తోముతుంది. అడగకుండానే శుక్రవారం, మంగళ వారం ఇల్లుకడిగి పోతుంది-అన్నం మిగిలితే పెడతాను లేకుంటే లేదు-మేమిచ్చేది పన్నెండు రూపాయలే'

రాధారాణి కొంచెం చిరాకుపడ్డట్లు ఆమె నేత్రాలు విచిత్రంగా నర్తించాయి వెంకటసుబ్బయ్య అదీ గ్రహించాడు.

సంభాషణ మార్చేందుకని 'ఈ మధ్య ఏదైనా సినిమా కెళ్ళారా' అన్నాడు కృష్ణారావుతో.

'ఆఁ-మొన్న హిచ్‌కాక్ పిక్చర్ ఒకటి వస్తేను వెళ్ళాము.' అన్నది రాధా రాణి.

మీరు వెళ్ళలేదా' అన్నాడు కృష్ణారావు.

'ఏదండీ తీరిక దొరకందే' అన్నాడు వెంకట సుబ్బయ్య.

'ఈ న్యూవేవ్ పిక్చర్స్ గూర్చి మీ అభిప్రాయమేమిటి' ప్రశ్నించింది రాధారాణి కామాక్షిని.

'అవేమిటో నాకు తెలీదు' స్పష్టంగా జవాబిచ్చింది కామాక్షి.

'మీ రెలాంటి సినిమాలు చూస్తారయితే'

'ఏవో మంచి తెలుగు సినిమాలు-సీతారామ కల్యాణం లవకుశ, లాంటివి' రాధారాణి నవ్వింది!!

ఆ నవ్వునుండి హేళన తుంపురులు తుంపురులుగా రాలుతున్నది.

'ఇక లే పోదాము' అన్నాడు సుబ్బయ్య భార్యను.

'వస్తానండీ' నమస్కరించి లేచింది కామాక్షి.

విష్ చేసింది రాధారాణి

సుబ్బయ్యా కామాక్షి బయటకు వచ్చారు.

ఛీ! రాధారాణి ఏమనుకుంటుందో తన భార్యను గూర్చి!

బొత్తిగా మానర్స్ కూడా తెలియని జంగ్లీ అనుకుంటుందా?

రిక్షాలో ఎక్కాక కామాక్షి అన్నది 'అదేం మర్యాదండీ ఆమెది. వెళ్తున్నానంటే బొట్టన్నా పెట్టకుండా టా టా-చెపుతుంది' అన్నది బుగ్గలు నొక్కుకుంటూ

'చాల్లే - నోరుమూసుకో' విసుక్కున్నాడు సుబ్బయ్య.

భర్తకెందుకు కోపం వచ్చిందో, తన ప్రవర్తనలో ఏది లోపంగా కనపడ్డదో మటుకు కామాక్షికి అర్థంకాకపోయినా సుబ్బయ్య మాటప్రకారం నోరు మూసుకున్నది ఇంటికి పోయేవరకూ.

'ఛీ! దీన్ని ఎవరి ఇంటికీ తీసుకెళ్ళకూడదు' అనుకున్నాడు సుబ్బయ్య.

మరి సభ్యత వచ్చేదెలా??

ఇళ్ళకు కాకపోయినా ఏవైనా సభలకూ వాటికి తీసుకుపోతే బాగుపడదూ-

రేపు కళాభవన్ చిత్ర ప్రదర్శనానికి తీసుకెళ్తే!!

ఔను! అంతే!!

ఈ అనుకున్నదాన్ని అమలుపెట్టాడు సుబ్బయ్య వెంటనే.

కళాభవన్‌లో మోడరన్ ఆర్ట్ ప్రదర్శనం ప్రారంభమైంది.

అంతా వేయినోళ్ళతో బొమ్మలను పొడుగుతూ పోతున్నారు ప్రేక్షకులు.

కామాక్షివైపు చూచాడు సుబ్బయ్య ఉత్సాహంగా-

ఆమె ఏదో అయోమయంగా చూస్తున్నది బొమ్మల్ని-

'బాగున్నాయికదూ కామాక్షీ బొమ్మలు'

'నిజం చెప్పాలంటే నాకివేమిటో అసలు అర్థమేకాలేదండి'.

'వెర్రిమొగమా కాస్త బ్రైన్ ఉపయోగించి ఆలోచించు.'

'ఎంత తన్నుకుచచ్చినా ఆ రంగులేమిటో గీతలేమిటో నాకు బోధ పడటంలేదండీ' - దీనికింద 'అర్థరాత్రి సూర్యుడు' తెలుగులో వ్రాశారు-పైన ఏదో చెట్టు బొమ్మ వుంది ఈ చెట్టుకూ అర్థరాత్రి సూర్యుడికి ఏమిటి సంబంధం? అసలు సూర్యుడు అర్థరాత్రి రావడమేమిటి?'

'మూర్ఖురాలా! అదంతా సింబాలిజం - మిస్టిసిజం - ఫ్రెంచ్ ఆర్ట్-' కోపంతో ఎవరూ వినకుండా మందలించాడు కామాక్షిని సుబ్బయ్య-

'అదేమో నాకు తెలియదు సుమండీ - ఆ బొమ్మ చూడండి - అసహ్యంగా - బొమ్మలు ఎలా పైకి కన్పడేటట్లు నగ్నంగా గీచాడో కళాకారుడు-నా చిన్నతనంలో రవివర్మ బొమ్మలు చూడలేదూ - అందులో ఇలా కండరమూ చర్మమూ ప్రదర్శించేవాడా? బొమ్మలంటే ఏమిటండీ - ఆ బొమ్మయొక్క ఆత్మ సౌందర్యం కన్పడవద్దూ?'

సుబ్బయ్య నివ్వెరపోయాడు భార్య మాటలకు-

భార్య తనకు తెలియకుండానే మహా కళాసిద్ధాంతాన్ని ప్రవచించింది. పాశ్చాత్య చిత్రకళలో భౌతికమైన చర్మమూ మాంసమూ ఎక్కువగా ప్రదర్శింపబడుతాయి - ఎక్స్ప్రెషన్ ఎక్కువగా వుంటుంది - భారతీయ కళా దర్శనంలో చర్మానికికాక హృదయానికీ ఆత్మకూ ప్రాధాన్యాన్ని ఇచ్చి రచిస్తాడు చిత్రకారుడు.

బొమ్మలు నగ్నంగా ఉద్రేకాలను రెచ్చగొట్టేటట్లుకాక, ఏదో ఉపనిషత్ సందేశాన్ని చిరునవ్వులతో చాటి చెపుతున్నట్లుంటాయి.

కామాక్షికి ఈ కళావిమర్శనం తెలియదు-

కాని ఆమె చెప్పినది ప్రత్యక్షర సత్యమే!

'ఫరవాలేదు - నా భార్యకూడా కాస్త తెలివైందే' ననుకున్నాడు మొట్ట మొదటిసారిగా సుబ్బయ్య!

ఇంటికి బయలుదేరారు ఇద్దరూ-

'మీకు సిగ్గులేకపోతే పోయింది నన్నుమాత్రం వెంటబెట్టుకొని ఇలా గుడ్డ ల్లేని బొమ్మలు చూచేందుకు మీ జన్మలో బయలుదేరకండి' అన్నది కామాక్షి కోపంగా-

'నీకీజన్మలో సంస్కారం అబ్బదు కామాక్షీ - నా కృషి మొత్తం ఎలుక తోలుతెచ్చి ఉతికినట్లే అవుతున్నది' అన్నాడు సుబ్బయ్య బాధగా!

కృష్ణారావు రేపిస్తానని మూడువందలు చేబదులు తీసుకున్నాడు. వారం రోజులైంది- తీర్చలేదు.

అడిగితే ఎలావుంటుందో - అడగకపోతే తనకు కటకటగావుంది.

'సరే'నని సాహసించి వెళ్ళాడు వెంకటసుబ్బయ్య.

తాను వెళ్ళేసరికి రాధాకృష్ణులు ఏదో తీవ్రంగా వాదించుకుంటున్నారు.

సుబ్బయ్యను చూచి ఇంగ్లీషులో అన్నది రాధారాణి 'హల్లో మిస్టర్ సుబ్బయ్యా కమిన్ - మీరు చెప్పండి ఈ పెద్దమనిషికి - అందం దేవుడిచ్చిన వరమంటారా. కాదంటారా?'

'ఔనౌను వరమే'నంటూ ఓ కుర్చీ లాక్కొని కూర్చున్నాడు సుబ్బయ్య.

'దానిని నిత్యనూతనంగా పోషించుకోడం మన కర్తవ్యమా కాదా?' రాధా రాణి సూటిగా ప్రశ్నించింది.

'అవును కర్తవ్యమే! జాన్ రస్కిన్ అందుకే అన్నాడొక సందర్భంలో- 'స్త్రీకి ప్రకృతి ఇచ్చిన తొలి బహుమానం సౌందర్యం - ముందుగా తీసేసుకునేదీ దానినే' అని-

'అం(.. అలా మా ఆయనకు గడ్డి పెడుదురూ ఆ రస్కిన్ సూక్తిని అర్థ తాత్పర్యాలతో వివరించి.లోకంలో అందరూ పిల్లలను కనేందుకే పుట్టరు వెంకట సుబ్బయ్యగారు.కొందరు సౌందర్యపతులు పుడతారు-సౌందర్యవతులుగానే ధృవతారలౌతారు.... మేము వో అందమైన పిల్లనో పిల్లవాణ్ణో పెంచుకోవాలని నిశ్చయించుకున్నాము సుబ్బయ్యగారూ.'

'బాగుంది....బాగుంది'

కృష్ణారావు నిట్టూరుస్తూ లేచి 'సుబ్బయ్యా! ఒక్కమాట' అని గుమ్మం ఇవతలకి పిలుచుకు వచ్చాడు.

'సారీ_మరేమీ అనుకోకు-రెండు రోజుల్లో పైకం సర్దేస్తాను సుబ్బయ్యా'

'అబ్బే! నేఁసలు అందుకు రాలేదు కృష్ణా'

'హోనీలే,నువ్వెందుకు వచ్చినా చెప్పడం నా ధర్మంకదా! .. ' అని ఒక్క క్షణం ఆగి అన్నాడు.

'నాకీవిడ సౌందర్యోపాసనతో పిచ్చెక్కి పోతున్నది-ఎంతడబ్బూ చాలక, ఏ ఆత్మహత్యో చేసుకోవాలని పిస్తున్నదీ'

సుబ్బయ్య గాలి స్తంభించినప్పుడు అల్లల్లాడని ఆకులా నిలబడ్డాడు ఊపిరి బిగించి.

'సుబ్బయ్యా! స్త్రీలందరూ భార్యలు కాలేరయ్యా! కొందరు గాజు బొమ్మల్లాంటి వ్యక్తులు అద్దాల బీరువాలల్లోనో మ్యూజియాలలోనూ ప్రదర్శింపదగ్గట్టూ, అలంకరింప దగ్గట్టూ వుంటారు-సంసార కూపానికి అతీతంగా వుండే ఈ అపురూపమైన పంకజాలను ఆదర్శంగా చూడాలే కాని వాస్తవ లోకంలో లాకాలని ప్రయత్నించామో నిప్పు నంటుకున్నట్లే ననుకో.'

సుబ్బయ్యకు ఏం జవాబు చెప్పాలో తెలియక వెర్రిముఖం వేశాడు.

'సుబ్బయ్యా.మా గొడవలు ఎప్పుడూ వుండేవే. ఏమీ అనుకోకు. రేపో ఎల్లుండో నేనే మీ ఇంటికి తెచ్చిస్తాను పైకం.'

'పరవాలేదు కృష్ణా! నువ్వలా బాధపడితే నేనసలు తీసుకోనే తీసుకోను తెలుసా?'

అంతకంటే, ఇంకేమరాలో తెలియక సుబ్బయ్య రోడ్డుమీద పడ్డాడు.

నుదుట పట్టిన చెమటను చేతిగుడ్డతో గట్టిగా తుడుచుకొని రెండు ఊపిరితిత్తుల నిండా గాలిపీల్చుకోని కామాక్షి అందాన్ని కళ్ళనిండా భావనతో నింపుకొని సైకిల్‌ను ఇంటిముఖం పట్టించాడు వెంకట సుబ్బయ్య!!